సాక్షి సంగారెడ్డి

సోమవారం, 8, జనవరి, 2024



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

న్యూస్‌రీల్

చిన్నజీయర్ స్వామిని కలిసిన ఎమ్మెల్యే



చిన్నజీయర్ స్వామితో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దంపతులు

పటాన్ చెరు: హైదరాబాద్ శివారులోని ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త త్రిదండి చిన్న జీయర్‌స్వామిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి మూడోసారి విజయం సాధించిన ఎమ్మెల్యేను స్వామి అభినందించారు. తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ లచ్చిరామ్ నాయక్, దాసు, గూడెం సంతోష్ గౌడ్, సందీప్ గౌడ్ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు

సంగారెడ్డి టౌన్ : కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు యువజన అధికారి ఎం.రంజిత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న పట్టణంలోని ప్రభుత్వ తార డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. 'మై భారత్.. వికసిత్ భారత్ -2047' అంశంపై నిర్వహించే ఈ పోటీలలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గలవారు పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం, 9963056730 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఐఎన్‌టీయూసీతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఐఎన్‌టీయూసీ తోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఏషియన్ పెయింట్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో కార్మిక హక్కులను సాధించిన ఘనత అఖిలభారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన కృషి వల్ల జూనియర్ కార్మికునికి సుమారు రూ.22 వేలు, సీనియర్ కార్మికునికి సుమారు రూ.33 వేల వేతనాన్ని పెంచి 15 రోజుల గ్రాట్యుటీ 21 రోజులకు అయ్యిందన్నారు. రెండుసార్లు అధ్యక్షుడిగా ఉన్న తీగల కృష్ణారెడ్డి కార్మికులను మోసం చేశారని విమర్శించారు. వచ్చే కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించినట్లయితే పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మాజీ కార్మిక సంఘం అధ్యక్షుడు శుక్ల ఉపాధ్యక్షులు చంద్రమౌళి, కర్ణాకర్ రెడ్డి, లక్ష్మణరావు సూర్యకాంత్, జీఎస్ రెడ్డి, శ్రీనివాస్, సోమిరెడ్డి, సింగ్ సుబ్రహ్మణ్యం, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్రోను ఇస్నాపూర్ వరకు విస్తరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

పటాన్‌చెరు టౌన్: మెట్రోరైల్‌ను ఇస్నాపూర్ వరకు విస్తరించాలని మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మెట్రోరైల్‌ను మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు పొడిగింపు నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గత ప్రభుత్వం ఇస్నాపూర్ వరకు మెట్రోను విస్తరించాలని నిర్ణయం తీసుకుందని, దానినే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై త్వరలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రుద్రారం శంకర్, ఈర్ల రాజు, మెట్టు శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.

తరించి.. కల్యాణం తిలకించి

- భారీగా హాజరైన భక్తజనం
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మంత్రులు
- మల్లన్న నామస్మరణతో మారుమోగిన కొమురవెల్లి



మల్లన్న కల్యాణానికి హాజరైన భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మామిడి తోరణాలు.. మేళ తాళాలు.. మంగళ వాయిద్యాలు.. అశేష భక్తజనం సమక్షంలో కొమురెల్లి మల్లన్న స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. కొమురెల్లి పుణ్యక్షేత్రంలోని తోటబావి వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామివారి వివాహాన్ని కనులపండువగా నిర్వహించారు. మొదట ఆలయ గర్భగుడిలో ఉదయం 9గంటలకు మూల విరాట్‌కు కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ఊరేగింపుగా కళ్యాణవేదికకు తీసుకువచ్చారు. ప్రభుత్వం తరఫున స్వామివార్లకు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సమర్పించారు.

ఉజ్జయిని పీఠాధిపతి పర్యవేక్షణలో...

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని పీఠాధిపతి జగద్గురు1008 సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య మహాస్వామి పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. మల్లికార్జున స్వామి, బలిజ మేడలమ్మ, గొల్లకేతమ్మల కల్యాణ వేడుకలను వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో మల్లన్న మూల విరాట్ వద్ద అమ్మవార్ల తరఫున మహాదేవుని వంశస్తులైన సాంబయ్య దంపతులు, వరుడు మల్లికార్జున స్వామి తరఫున పడిగన్నగారి వంశస్తులు మల్లయ్య దంపతులు కల్యాణం జరిపించారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య మధ్యాహ్నం 12.28గంటలకు మేడలదేవి, గొల్ల కేతాదేవిని కోరమీసాల స్వామి కొమురెల్లి మల్లన్న మనువాడారు.

హాజరైన ప్రముఖులు

కల్యాణాని తిలకించేందుకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీపీఓ దేవకీదేవితో పాటు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కట్నకానుకలు సమర్పించారు.

వైభవంగా రథోత్సవం

మల్లన్న కల్యాణం అనంతరం స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం రథానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి అన్నదాన సత్రం నుంచి మల్లన్న గుట్ట చుట్టూ రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రథోత్సవం నిర్వహిస్తున్న సమయంలో చక్రం ఇనుప పట్టీ ఊడిపోయింది.దానికి మరమ్మతులు నిర్వహించి రథోత్సవాన్ని కొనసాగించారు.



అమ్మవార్లకు బంగారు కిరీటాలు



పట్నం వేసి మొక్కు తీర్చుకుంటున్న మంత్రి కొండా సురేఖ

వచ్చే సంవత్సరం నిర్వహించే కల్యాణం నాటికి అమ్మవార్లు మేడలమ్మ, కేతమ్మలకు బంగారు కిరీటాలు చేయిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. స్వామి వారి కల్యాణానికి హాజరైన మంత్రి మట్లాడుతూ గతంలో స్వామి వారికి చేయించిన విధంగా అమ్మవార్లకు కిరీటాలు చేయించాలని ఆలయ ఈవోను ఆదేశించినట్లు తెలిపారు. బ్రహోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

కూలిన చర్చి స్లాబ్.. ఒకరి మృతి



కూలిన చర్చి స్లాబ్

- 9 మందికి గాయాలు

కోహీర్(జహీరాబాద్): మండల కేంద్రం కోహీర్‌లోని మిషన్ కాంపౌండ్‌లో ఆదివారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న స్లాబ్ అకస్మాత్తుగా కుప్ప కూలడంతో ఓ యువకుడు మృతిచెందగా.. తొమ్మిది మంది కూలీలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చర్చికి స్లాబ్ వేస్తుండగా సెంట్రింగ్ పైపులు కుంగిపోయి ఒక్కసారిగా స్లాబుకు అమర్చిన ఇనుప రాడ్లు, సిమెంటు కంకర కుప్పకూలి పోయాయి. స్లాబ్ వేస్తున్న కూలీల మీద సామగ్రి పడటంతో వారు తప్పించుకోనే అవకాశం లేకుండాపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాసిముల్లా(19), రాజును చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కాసిముల్లా మరణించాడు. మృతుడు మయన్మార్ నివాసి. హైదరాబాద్ బాలాపూర్ రెఫ్యూజీ క్యాంపులో ఉంటున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. సెంట్రింగ్ కాంట్రాక్టర్ గులాం మొహిజోద్దీన్ వద్ద కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో కాసిముల్లా శవాన్ని సంగారెడ్డి ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. తీవ్రంగా గాయపడిన మరో యువకుడు రాజు నేపాల్ నివాసి.



క్షతగాత్రులను తరలిస్తున్న స్థానికులు

మిగతా క్షతగాత్రులు తుల్జాఉల్ షేక్, దాలిం షేక్, అబ్దుల్ రహీమ్ పశ్చిమ బెంగాల్ నివాసులు. కృష్ణా నంద్, ఓం ప్రకాష్ ఉత్తర్ ప్రదేశ్ నివాసులు, మోహన్ సింగ్ ఛత్తీస్‌గఢ్, షేక్ ఆదిల్ అహమద్ హైదరాబాద్ నివాసులు. డీఎస్పీ రఘు, ఆర్డీఓ వెంకారెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. సోమవారం మధ్యాహ్నం లోపు కూలిన స్లాబ్ శిథిలాలను తొలగించాలని ఆదేశించారు. స్లాబ్ వేసే క్రమంలో జాగ్రత్తలు తీసుకోక పోవడం వల్లే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విఠల్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ మంత్రి చంద్రశేఖర్ సందర్శించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు.

అర్జీల ఆన్‌లైన్ షురూ

- మొత్తం దరఖాస్తులు 3,83,979
- వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభం
- ఈ నెల 17లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం



ఆన్‌లైన్‌లో దరఖాస్తుల వివరాలు నమోదు చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

సంగారెడ్డి టౌన్ : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారం ముగిసింది. ఇప్పటివరకు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసేందుకు జిల్లావ్యాప్తంగా అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మొదలైంది. కాంగ్రెస్ సర్కార్.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు రవాణా, ఆరోగ్యశ్రీ అమలు చేస్తోంది. మిగతా పథకాలకు అర్హులను తేల్చేందుకు వీలుగా గతేడాది డిసెంబర్ 28 నుంచి ఈనెల 6వ తేదీ దాకా ప్రజాపాలన పేరిట గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తోంది. ఆ సభల్లో ప్రతీ కుటుంబం తమ వివరాలను తెలిపేలా దరఖాస్తు ఫారాలు అందించింది. పూర్తిచేసిన దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే.

ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా అర్హులకు గుర్తించేందుకు ప్రభుత్వం గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజా పాలన పేరుతో పల్లెలు, పట్టణాల్లో గ్రామ సభలు నిర్వహించింది. పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాలకు 3,83,979 దరఖాస్తులు వచ్చాయి. రేషన్‌కార్డుల కోసం 58,708, 215 ధరణి అర్జీలు అందాయి. దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను ఈనెల 17లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని 647 గ్రామ పంచాయతీలు, 8 పురపాలక సంఘాల పరిధిలో 99 బృందాలు, 3,644 కౌంటర్లు ఏర్పాటు చేశారు. నిర్దేశించిన తేదీల ప్రకారం గ్రామ సభలు నిర్వహించి ఆయా కౌంటర్ల వారీగా అర్జీలు స్వీకరించారు.

పర్యవేక్షణాధికారుల నియామకం

జిల్లాలో ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామానికి ఒక్కో ప్రత్యేక అధికారి చొప్పున నియమించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు రెండు బృందాలుగా విడిపోయి గ్రామసభలు పూర్తి చేశారు. పట్టణాల్లో పురపాలకశాఖ కమిషనర్, ఆ శాఖలో పని చేసే ఇంజినీరింగ్ అధికా రులు, ఉద్యోగులు భాగస్వాములయ్యారు. వారంతా దరఖాస్తుల నమోదు పై పర్యవేక్షణ చేయనున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది.

602 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు

దరఖాస్తుల స్వీకరణకు గ్రామసభలు ముగియడంతో అధికారులు వివరాల నమోదుపై దృష్టి సారించారు. దరఖాస్తుల్లోని అంశాలు ఎంట్రీ చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందు కోసం పురపాలికలు, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి ఐకేపీ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా తదితరాల్లో పని చేస్తున్న 602 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు ఈ బాధ్యత అప్పగించారు. ఒక్కో ఆపరేటర్ నిత్యం 60 దరఖాస్తులు పూర్తి చేసేలా నిర్దేశించారు. వారు 27 అంశాలను పథకాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వారి పేరుతో ప్రత్యేక లాగిన్ కేటాయించి మొబైల్ నంబర్ వచ్చే ఓటీపీ సాయంతో డేటా ఎంట్రీ చేసేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత దరఖాస్తుపై ఎర్ర రంగుతో టిక్ చేస్తారు. అర్జీలన్నీ పక్కాగా భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆపరేటర్లకు ఒక దరఖాస్తుకు రూ.5 చొప్పున, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ.15 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది.

తప్పులు ఉండొద్దు



ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలి. దరఖాస్తులను క్రాస్ చెక్ చేసుకోవాలి. నమోదు ప్రక్రియను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలి. నిర్దీత గడువులోగా డేటా ఎంట్రీ పూర్తవ్వాలి.

– వల్లూరు క్రాంతి, కలెక్టర్

లోక్‌సభ సన్నాహం

- జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీల గురి
- ముఖ్య నేతల సమావేశాలతో సమాయత్తం
- ఎంపీ టికెట్ల కోసం ఆశావహులు క్యూ



జహీరాబాద్: పార్లమెంట్ ఎన్నికలపై ప్రధాన పార్టీలు గురిపెట్టాయి. ప్రధానంగా జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ దృష్టిసారించాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ముఖ్య నాయకులు సమావేశాలు నిర్వహిస్తూ హడావిడి చేస్తున్నారు. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానాలతో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ స్థానాలున్నాయి. దీంతో ఆయా జిల్లాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీల నేతలు టిక్కెట్‌ను దక్కించుకునేందుకు ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసుకుంటున్నారు.

బీఆర్ఎస్ నుంచి..

బీఆర్ఎస్ నుంచి రెండు పర్యాయాలు పోటీచేసి గెలుపొందిన బీబీ పాటిల్.. తిరిగి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. గత ఎన్నికల్లో ఓటమి అంచువరకు వెళ్లి స్వల్ప ఓట్ల తేడాతో ఆయన గట్టెక్కారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగు చెందుతున్నారని, తిరిగి బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. బీబీపాటిల్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని బహిరంగంగానే విమర్శలున్నాయి. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని మార్చే అవకాశం లేకపోలేదనే అభిప్రాయాన్ని బీఆర్ఎస్ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. అధిష్టానం కొత్తవారికి టికెట్ కేటాయించే విషయాన్ని పరిశీలిస్తే డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనయుడు భాస్కర్‌రెడ్డి, ఇటీవల ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమి చెందిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిల పేర్లు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మైనార్టీల సంఖ్య గణనీయంగా ఉన్నందున ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్, డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, మైనార్టీ నేత కిజర్‌యాఫైల పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది.

కాంగ్రెస్ ధీమా..

జహీరాబాద్‌లో గెలుపు మాదే అనే ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉంది. నారాయణఖేడ్‌కు చెందిన మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, జహీరాబాద్‌కు చెందిన పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి ఇక్కడి నుంచి టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. సురేష్ శెట్కార్ ఒక పర్యాయం ఎంపీగా గెలుపొందగా, ఒక మారు ఓటమి చెందారు. పట్టణానికి చెందిన ఎస్ఆర్ఐఎస్.ఉజ్వల్‌రెడ్డి సైతం టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. కొత్త వారికి అవకాశం ఇవ్వాలనుకుంటే ఉజ్వల్‌రెడ్డి అభ్యర్థిత్వం వైపు అధిష్టానం మొగ్గుచూపే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓటమిచెందిన మదన్‌మోహన్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో అతడు పోటీకి నిరాసక్తత చూపుతున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ కూడా టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

బీజేపీలో పోటీ ఎక్కువే..

జహీరాబాద్ నుంచి పోటీ చేసేందుకు బీజేపీ నుంచి చాలామంది పోటీ పడుతున్నారు. ఆ పార్టీ ఇప్పటికే పార్టీ అగ్రనేతలు నివేదికలు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి టికెట్ కోసం డజను మంది పోటీ పడుతున్నారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రాజాసింగ్, క్యాసినో కింగ్ చీకోటి ప్రవీణ్, పార్టీ జాతీయ నాయకురాలు ఆకుల విజయ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయినా స్థానికంగా ఉన్న నేతలు సైతం అనేక మంది ఆశతో ఉన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, బిలాల్‌పూర్‌కు చెందిన సంఘనేత చర్ల గోపాల్‌రెడ్డి, గత ఎన్నికల్లో ఓటమి చెందిన బాణాల లక్ష్మారెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్, పారిశ్రామిక వేత్తలు పైడి ఎల్లారెడ్డి, సుభాష్‌రెడ్డి, ఎం.ప్రకాష్‌రెడ్డి, సోమాయప్పస్వామి, మురళీధర్‌గౌడ్, పైలా క్రిష్టారెడ్డిలతో పాటు ఆయా జిల్లాలకు చెందిన జర్నలిస్టు సంఘాల నేతలు టికెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్నందున టికెట్ కేటాయిస్తే సునాయసంగా విజయం సాధిస్తామని వారు అధిష్టానవర్గాన్ని కోరినట్లు తెలిసింది. ఆయా పార్టీలు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

‘క్రీడలతో మానసిక ఉల్లాసం’



క్రీడాకారులతో మాణిక్యం, చింతా సాయినాథ్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటుగా శారీరక దృఢత్వం ఏర్పడుతుందని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చింతా సాయినాథ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొనాపూర్ గ్రామంలో పట్లోళ్ల శివ నాగప్ప మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. పోటీల్లో గెలుపొందిన టీమ్‌కు రూ.25 వేల నగదుతోపాటు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చంద్ర శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందీశ్వర్, సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ సభ్యురాలు లలిత, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు అంజన్న, మల్లన్న, నాయకులు సుధీర్ రెడ్డి, సంగమేశ్వర్, శివ కుమార్, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి



జాతరలో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): మల్లన్న ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని మల్లన్న గుట్టల్లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి, మదన్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు బీటీ రోడ్డు వేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు 13 మంది ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేటజోన్: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు 13 మంది క్రీడాకారులు ఎంపిక అయ్యారు. ఆదివారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో అండర్-14, అండర్-16 విభాగంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన వారిలో స్వాతి, మౌనిక, రామ్ చరణ్, నిఖిల్, నవ్య, శ్రీ చందన, భాగ్య, రమేశ్, స్పందన, శివకుమార్, రాహుల్, అజయ్, లోహిత్ రెడ్డి ఉన్నారు. వీరిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి అభినందించారు.

70 మద్యం బాటిళ్లు పట్టివేత

సంగారెడ్డి: అక్రమంగా రవాణ చేస్తున్న మద్యాన్ని జిల్లా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మునిపల్లి మండలం కంకల్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన తనిఖీల్లో గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 70 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, M.Tech, D-Pharma, B-Pharma, B.Sc (Agri), B.Sc (Nursing), B.Ed, MBA, MCA Eligible for all Govt Jobs & Further Studies. Ph: 8866977112,339. [HA-13275]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [H-793674]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-12552 18]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ఒగ్గు కళాకారుల విన్యాసాలు



వేద పర్యవేక్షణకు వస్తున్న మధ్యప్రదేశ్ ఉజ్జయిని పీఠాధిపతి దేశికేంద్ర శివాచార్య మహాస్వామీజీ



కల్యాణవేదికపై అర్చకులకు తలంబ్రాలు అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ

కల్యాణం వైభవోపేతం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశా రు. ముఖ్యంగా మాస్క్‌లు సైతం అందజేశారు. రథం ఊరేగింపు, పట్నాలు, పోతులరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

లిఫ్ట్ బహూకరణ

ఆలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా కొంపల్లికి చెందిన బబ్బూరి భిక్షపతి గౌడ్, నాగమణి దంపతుల పేరు మీద వారి కుమారుడు బాలకృష్ణ రూ.9 లక్షలు వెచ్చించి లిఫ్టును ఏర్పాటు చేయించాడు.

దొంగల చేతి వాటం

మల్లన్న కల్యాణంలో దొంగలు చేతి వాటం చూపించారు. పలువురి మహిళల మెడలో నుంచి బంగారు ఆభరణాలు దొంగిలించారు. ప్రమీల అనే భక్తురాలు స్వామి వారి కల్యాణానికి రాగా ఆమె మెడలోనుంచి 4 తులాల బంగారు పుస్తెల తాడు అపహరించినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ నాగరాజు వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు



జీలకర్ర బెల్లం ధారణ..



మల్లన్న స్వామి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



లిఫ్టు ప్రారంభిస్తున్న భిక్షపతి నాగమణి



మాస్క్‌లు అందజేస్తున్న వైద్యసిబ్బంది



కల్యాణ వేదిక ప్రాంగణంలో భక్తుల సందడి



కల్యాణ మండపానికి పల్లకిలో వేంచేస్తున్న అమ్మవార్లు

బాలలు.. కరాటే ధీరులు

- కరాటే పోటీల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు
- మాస్టర్ శ్రీకాంత్ ఉచితంగా శిక్షణ
- దుబ్బాక మండలంలోని 20 పైగా పాఠశాలలు..
- జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న బాలికలు



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్ శ్రీకాంత్

దుబ్బాక: ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలపై పెరుగుతున్న దాడుల దృష్ట్యా ప్రత్యేక్షంగానో పరోక్షంగానో కరాటే విద్య ఎంతో తోడ్పడుతుంది. కరాటే విద్య అంటే ఇష్టపడని వారు ఉండరు. ఆపద సమయంలో తమను తాము రక్షించుకుంటూ ఇతరులకు ఆపద వచ్చినా కాపాడే యుద్ధ విద్యల్లో కరాటే ప్రత్యేకమైంది. అంతటి ప్రాధాన్యత కల్గిన కరాటే విద్యను ప్రతీ బాలిక నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో దుబ్బాక మున్సిపాలిటీ ధర్మాజీపేటకు చెందిన బురని శ్రీకాంత్ ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నాడు. ఇతడి శిక్షణలో దుబ్బాక మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కరాటేలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా శిక్షణ..

దుబ్బాక మున్సిపాలిటీ ధర్మాజీపేటకు చెందిన బురని శ్రీకాంత్‌ది వ్యవసాయ కుటుంబం. 2012 సంవత్సరంలో హైదరాబాద్‌లో కరాటేలో శిక్షణ తీసుకున్నాడు. 2013-2014 సంవత్సరంలో కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించాడు. దుబ్బాక మండలంలో గల 20 పైగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దాదాపు 1500 మంది విద్యార్థులకు ఎనిమిదేళ్లుగా ఉచితంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. తనకు రోజు గడవాలి కాబట్టి ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల వద్ద తక్కువ మొత్తంలో ఫీజు తీసుకొని శిక్షణ ఇస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా పాఠశాలలో శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

జాతీయ ,రాష్ట్ర స్థాయి పోటీల్లో..

శ్రీకాంత్ దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ఇటీవల గోవా, ఢిల్లీ, ముంబై, బెంగుళూర్‌లో జరిగిన అంతర్జాతీయ, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వివిధ విభాగాల్లో విద్యార్థులు 30కి బంగారు పతకాలు, 50 పైగా సిల్వర్ పతకాలు సాధించారు.



సినీనటుడు సుమన్ చేతుల మీదుగా కప్ అందుకుంటున్న మాస్టర్ శ్రీకాంత్

ఒలింపిక్ స్థాయికి వెళ్లాలి



ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలో బంగారు పతకం గెలవడం ఆనందంగా ఉంది. ముందుముందు మరిన్ని విజయాలు సాధించి ఒలింపిక్ స్థాయిలో పతకం గెలవడానికి తగిన సాధన చేస్తాను. ఒలింపిక్‌లో పతకం సాధించి మన దేశానికి మంచి పేరును తెచ్చేలా కృషి చేస్తాను.

–సమలేటి మనస్విని, విద్యార్థిని, దుబ్బాక

కోచ్ మెలకువలతోనే..



శిక్షణ ఇచ్చే సమయంలో మా కోచ్ చెప్పిన మెలకువలను తూచా తప్పకుండా పాటిస్తూ విజయాలు సాధిస్తున్నాను. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం రావడం సంతోషంగా ఉంది. ఆత్మ విశ్వాసంతో ముందుకు కదిలి మరిన్ని విజయాలు సాధించి మా తల్లిదండ్రులకు, పాఠశాలకు మా గ్రామానికి మంచి పేరును తీసుకొస్తాను.

–ఎంగారి వర్షిని, విద్యార్థిని, దుబ్బాక

ప్రభుత్వం ప్రోత్సహిస్తే..



పేద విద్యార్థులందరికీ కరాటే నేర్పించి వారి జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నాను. బాలికలందరూ కరాటే నేర్చుకొని వారిలో ఆత్మ స్థైర్యం నింపి ఆపద సమయంలో తమను తాము కాపాడుకునేలా శిక్షణ ఇస్తున్నా. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా.

–శ్రీకాంత్ కరాటే మాస్టర్, ధర్మాజీపేట

అందమైన చేతిరాత.. అందివచ్చే భవిత

- చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ
- ప్రాక్టీస్‌తో రాత మరింత మెరుగు
- నిపుణుడు ఎజాస్ అహ్మద్ సూచనలు, సలహాలు

తూప్రాన్: విద్యార్థి అభ్యసనలో మొదటి ఆకర్షణ చేతిరాత. చేతి రాత ఎంత గుండ్రటి, ముత్యాల్లాంటి అక్షరాలతో జవాబులు రాస్తే పేపర్లు దిద్దే మాస్టార్లకు చక్కటి అభిప్రాయం ఏర్పడి మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. కొందరు ప్రశ్నకు ఎంత బాగా సమాధానం రాసినా, అది అర్థం కాని రీతిలో ఉంటే మార్కులు తక్కువగా వస్తాయి. ఇందుకు సరైన సమాధానాలతోపాటు అందమైన చేతి రాత కూడా ముఖ్యమే అంటున్నారు సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్. చేతిరాతపై విద్యార్థులకు సలహాలు, సూచనలను ప్రసార, మాధ్యమాలతోపాటు పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

పరీక్షల సీజన్ ప్రారంభమైంది.. త్వరలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. సంవత్సరం పొడవున ఎంత చదివినా పరీక్షల్లో ఎలా రాశాం.. ఏం రాశామన్నదే విద్యార్థుల్లో ఆందోళన కలుగజేస్తోంది. విద్యార్థులు చేతి రాతపై కాస్త దృష్టి సారిస్తే పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

చేతరాతపై సూచనలు, సలహాలు

- తెలుగు రాతలో అక్షరాలు గుండ్రంగా ఉండాలి.
- మరీ చిన్నవిగా, మరీ పెద్దవిగా కాకుండా రాయాలి.
- పరీక్షల్లో సమాధాన పత్రంలో మొదటి నుంచి చివరి వరకు ఒకే రాత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ముత్యాల్లాంటి అక్షరాలుంటే మూల్యాంకణం చేసేవారికి ప్రారంభంలోనే ఓ మంచి అభిప్రాయం ఏర్పడుతుంది.
- మంచి పెన్ను వాడాలి. రాస్తున్న పేజీ వెనుక వైపు పాడు చేయని పెన్నులను వాడాలి.
- సమాధాన పత్రంలో కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పదం, పదానికి మధ్య తగిన స్థలం వదలాలి.

సమయంపై దృష్టి సారించాలి

- పరీక్షల్లో సమయం వృథా చేయకూడదు.
- వచ్చిన ప్రశ్నలు తర్వాత రాద్దామని, రాని ప్రశ్నల కోసం తాపత్రయ పడడం మానుకోవాలి. చివరకు వచ్చిన వాటిని సరిగా రాయలేకపోతారు.
- ఏఏ పరీక్షకు ఏమి కావాలి అన్న విషయాన్ని గుర్తుంచుకొని తీసుకెళ్లాలి. ఇతరులను అడిగి సమయం వృథా చేసుకోవద్దు.
- చివరి నిమిషాల్లో ఆందోళనకు గురై అడ్డదిడ్డంగా రాసేందుకు కారణమవుతోంది.



చేతిరాతను బోర్డుపై వివరిస్తున్న అహ్మద్

అందరికీ సాధ్యమే



విద్యార్థుల్లో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. వీరిలో కొందరు చిన్న అక్షరాలుగా అలవాటు పడుతారు. మరి కొంత మంది పెద్ద అక్షరాలు రాస్తుంటారు. ఇది సరియైన విధానం కాదు. ‘‘అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే’’ అను పుస్తకంను 150 సార్లకు పైగా అచ్చు వేయబడ్డ పుస్తకం. 1994 నుంచి విద్యార్థులకు, టీచర్లకు గ్రూప్స్ రాసే యువతకు, రాత మీద ఆసక్తి కనబరుస్తున్నాను.

– ఎజాస్ అహ్మద్, చేతిరాత నిపుణుడు

సామాజిక భద్రత చట్టాన్ని అమలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం రక్షణ కల్పించిన సామాజిక భద్రత 2008 చట్టాన్ని అమలు చేయాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పీ.శంకర్ డిమాండ్ చేశారు. జాతీయ ప్రజా ఉద్యమాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికుల హక్కులు, పోరాటాలపై మహారాష్ట్ర రాజధాని ముంబాయిలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సులో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక భద్రత చట్టాన్ని అమలు చేయకుండా 47 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాయడంపై సదస్సులో చర్చిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తుందన్నారు. పట్టణాల్లో జీవిస్తున్న అసంఘటిత కార్మికులకు ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో అసంఘటిత కార్మికుల కోసం ఎజెండాను రూపొందించి జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజు విడుదల చేసి రాజకీయ పార్టీలకు అందించాలని జాతీయ సదస్సు నిర్ణయించిందని పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- మూడోసారి ప్రధాని మోదీనే గెలుస్తారు
- డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి

జోగిపేట(అందోల్): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో పది ఎంపీ స్థానాలకు పైగా బీజేపీ గెలుచుకుంటుందని, జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని కూడా గెలుచుకోవడం ఖాయమని డీసీసీబీ మాజీ చైర్మన్, పార్టీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జోగిపేటకు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతం ఓట్లను బీజేపీ సాధించి 8 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుందన్నారు. గత పార్ల మెంట్ ఎన్నికల్లో 20 శాతం ఓట్లను సాధించి, 4 ఎంపీ స్థానాలను గెలుచుకున్నామని, రానున్న ఎంపీ ఎన్నికల్లో 35 శాతం ఓట్లకు పైగా సాధించి, పది 10 ఎంపీ స్థానాలను గెలుచుకుంటామన్నారు.పార్టీ అధిష్టానం ఆదేశిస్తే జహీరాబాద్ ఎంపీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. మా నాన్న దివంగత ఎం.బాగారెడ్డిని ఎంపీగా నాలుగు పర్యాయాలు, 7 సార్లు జహీరాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తు చేశారు. పార్టీ అధిష్టానం పరిశీలనలో తన పేరు కూడా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జగన్నాథం, సతీష్‌రెడ్డి, అప్సర్, విజయేందర్‌రెడ్డి, శివశంకర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడవిపందిని ఢీకొట్టిన బైక్

తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): అడవి పందిని బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ విఠల్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయిలాపూర్ తండాకు చెందిన హలావత్ ధన్‌సింగ్(24) శనివారం రాత్రి హరిచంద్‌తండాలో ఉన్న భార్య అరుణను తీసుకురావడానికి బైక్‌పై వెళ్తున్నాడు. తునికిగేట్ ఎంజేపీబీసీ గురుకుల పాఠశాల సమీపంలో 765డి జాతీయ రహదారిపై ఒక్కసారిగా అడవి పంది అడ్డు వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ధన్‌సింగ్‌కు తీవ్ర గాయాలు కాగా వాహనదారులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడిని 108లో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హలావత్ ధన్‌సింగ్ (ఫైల్)

అత్తింటి వేధింపుల కేసులో..

- భర్త, మామ రిమాండ్
- పరారీలో అత్త, ఆడపడుచులు

పటాన్‌చెరు టౌన్: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి నిందితులైన భర్త, మామను ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మర్పనూరు మండలం శ్రీరాంపూర్ కాలనీకి చెందిన ఇప్పబాపు (సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి)కూతురు లావణ్య(23)ను మందమర్రి గ్రామస్తుడైన అర్ష తిరుపతితో 2018 వివాహం చేశారు. ఏడాది తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని లావణ్యను తిరుపతితోపాటు అత్త, మామ, ఆడపడుచులు వేధించసాగారు. భార్యాభర్తలు పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో ఉంటుండగా ఈ నెల 5వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో లావణ్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం సాయంత్రం పటాన్‌చెరు మండలం కర్దనూర్ బస్టాండ్ సమీపంలో మృతురాలి భర్త తిరుపతి, మామ శంకరయ్య ఉండగా అదుపులో తీసుకొని రిమాండ్ తరలించారు. అత్త లక్ష్మి, ఆడపడుచులు రమాదేవి, రాజేశ్వర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.